ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023
5
పార్వతీపురం మన్యం

ఎలిఫెంట్ మానిటరింగ్ అధికారిగా మణికంఠేష్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎలిఫెంట్ మానిటరింగ్ జిల్లా అధికారిగా కె.మణికంఠేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో ఉత్తీర్ణులైన ఈయన రేంజర్ స్థాయి ర్యాంకుతో బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏనుగుల సంచరిస్తున్న ప్రదేశాలను పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజల చెంతకు వైద్య సేవలు

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజల చెంతకు వైద్య సేవలందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అన్నారు. ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించడంలో ఆత్మసంతృప్తి ఉంటుందన్నారు. వైద్య రంగంలో ఉంటూ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని, అప్పుడే ఆ రంగంలో విద్యను అభ్యసించిన అభ్యర్థులకు మధురస్మృతులు మిగులుతాయన్నారు. రాష్ట్ర వైద్యరోగ్య శాఖ ఆదేశాల మేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (ఎంఎల్‌హెచ్‌పి)కు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో, గ్రామీణ వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇందు కోసం అత్యవసర వైద్య సేవల నైపుణ్యాలపై సిహెచ్‌ఒలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలో గిరిజన, మారుమూల గ్రామాలు, రవాణా సౌకర్యం లేని గ్రామాలకు గ్రామ స్థాయిలోనే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు శిక్షణ ఎంతగానో దోహపడుతుందని చెప్పారు. సిహెచ్‌ఒలు శిక్షణ ద్వారా ప్రథమ చికిత్స, పాము, కుక్క కాటుకు చికిత్స, ఐవి ఇన్ఫ్యూషన్లన్, అన్ని పద్ధతుల ఇంజెక్షన్లు వేయడం, గాయాలకు డ్రెస్సింగ్, కుట్లు వేయడం, జీవన ప్రమాణాన్ని పెంచే నైపుణ్యం మొదలగు అత్యవసర వైద్య సేవలపై పూర్తి స్థాయిలో చికిత్సా నైపుణ్యాన్ని పొంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సిహెచ్‌ఒ (ఎంఎల్‌హెచ్‌పి) లు అందరినీ 7 బ్యాచ్ లుగా వేశామని ఒక్కక్క బ్యాచ్‌కు 40మంది ఉంటారని, ప్రతి బ్యాచ్‌కు 6 రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇందులో ఐదు రోజులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రి లోను, ఒక రోజు నెలిమర్ల మిమ్స్ ఆసుపత్రిలో శిక్షణ ఉంటుందన్నారు. సిహెచ్‌ఒలంతా వారు విధులు నిర్వహిస్తున్న చోటే స్థానికంగా ఉండి, ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా ఉప సంచాలకులు ఎటి రామనాథం, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, డిపిఎంఒ ధవళ భాస్కరరావు, డిఐఒ టి.జగన్మోహనరావు, డిటిసిఒ శ్యామ్ కుమార్, డిప్యూటి డిఎమ్ హెచ్‌ఒ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

డిఎహెచ్‌ఒకు ఉద్యోగోన్నతి

పార్వతీపురం : జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావుకు జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఉద్యోగోన్నతి కల్పించి విజయవాడలో గల ఎపి వెటర్నరీ కౌన్సిల్‌కు రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈశ్వరరావుకు ఉద్యోగోన్నతి పట్ల జిల్లా అధికారులు అభినందించారు.

బదిలీల నిబంధనలను సవరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల కోసం ఇచ్చిన జివో 33ను సవరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, ఎస్ మురళిమోహనరావులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బదిలీలకు జీరో సర్వీసు కంపల్సరీ, బదిలీలకు 8 సంవత్సరాల స్కూల్ ఎడ్యుకేషన్ జీవో ఇచ్చిందని ఈ నిబంధనలు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలన్నారు. బాలికల పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను అక్కడే ఉంచి జూనియర్ ఉపాధ్యాయులను బదిలీ చేయాలన్నారు. బాలుర పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ మహిళా ఉపాధ్యాయులను అక్కడే ఉంచి జూనియర్ ఉపాధ్యాయులను బదిలీ చేయాలన్నారు అలా వీలుకాని పక్షంలో వారు ఎక్కడ కోరుకుంటే అక్కడకు బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల జీవోను విడుదల చేశారు కానీ షెడ్యూల్ ప్రకటించలేదని కనుక బదిలీలపై దరఖాస్తు చేసుకునేందుకు నిర్దిష్ట కార్యాచరణతో కూడిన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని వారు కోరారు.

పంచాయతీరాజ్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక పంచాయతీరాజ్ డిఇఇ కార్యాలయంలో సోమవారం ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. పంచాయితీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.సుధాకర్ పై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని శ్రీకాకుళంలో కేసు నమోదు కావడంతో వారితో అనుసంధానంగా విజయనగరం ఎసిబి సిఐటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

కారు-చౌకగా...

కోట్ల విలువైన స్థలం కైవశం

ప్రజాశక్తి-పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సెంటు స్థలం లక్షల్లో విలువ పలుకుతుంది. ప్రధాన రహదారిలో జానెడు స్థలం ఉన్నా కూడా ఆ రేటు ఆకాశాన్ని తాకుతుంది. అలాంటి పట్టణ కేంద్రంలో కోట్లు విలువచేసే స్థలం నామ మాత్రపు విలువతో కొంతమంది లీజుకు కొట్టేశారు. ఇది మరి ఎక్కడో కాదు. పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న ఆ సంస్థకు చెందిన సుమారు ఎకరా స్థలాన్ని కొంతమంది వ్యక్తులు అతి తక్కువ రేటుకు లీజుకు దక్కించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ అధికారుల హస్తం ఈ లీజు వ్యవహారంలో ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా తూతూ మంత్రంగా ప్రకటన వేసి వేలం పాట మమ అనిపించారని ప్రధాన ఆరోపణ. అసలు వేలం ప్రకటనకు సంబంధించిన ప్రకటనలు ఏ పత్రికలో ప్రచురితమైందో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. మూడు అప్లికేషన్లు స్వీకరించినట్లు అందులో పార్వతీపురానికి చెందిన ఒక వ్యక్తికి నెలకు రూ.లక్షా65వేలకు లీజు ఖరారు చేసినట్లు ప్రకటించారు. అయితే మరో ఇద్దరు దరఖాస్తుదారులను బుజ్జగించి వెనక్కు తగ్గించినట్లుగా సమాచారం. మరికొంతమంది దరఖాస్తు వేయడానికి ఆర్టీసీ అధికారులను సంప్రదించిన్నప్పటికీ మసిపూసి మారేడుకాయ చేసినట్లుగా తెలుస్తుంది. రూ.10కోట్లు ష్యూర్టీ చూపించాలని, ఆ స్థలంలో ఏం చేస్తారు అనేది ముందుగా చెప్పాలని, దరఖాస్తు చేసుకోవడానికి వచ్చినవారిని వెనక్కి పంపించినట్లు తెలుస్తుంది.

లీజుకు అందజేసిన ఆర్‌టిసి స్థలం

నాకేమి తెలియదు

ఈ లీజు వ్యవహారంలో తనకు ఏం తెలియదు. జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో ఈ వేలం పాట జరిగింది. డిప్యూటీ సిటిఎం ఆధ్వర్యంలో ఈ వేలం పాట జరిగింది. అయితే వస్తున్న ఆరోపణలు అవాస్తవం.

వెంకటేశ్వర్లు,
ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్.

కేతు విశ్వనాథరెడ్డి మృతికి స్నేహ కళా సాహితీ సంతాపం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రముఖ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి సోమవారం ఉదయం ఒంగోలులో మృతి చెందడం పట్ల పార్వతీపురానికి చెందిన ప్రముఖ సాహితీ సంస్థ స్నేహ కళా సాహితి సభ్యులు రచయితలు, కవులు కళాకారులు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కవి రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి మరణం సాహితీప్రపంచానికి తీరని లోటని,. ఉత్తరాంధ్ర కథకులన్నా సాహిత్యమన్నా ఆయనకు చాలా ఇష్టమని అన్నారు. తనతో పాటుగా అట్టాడ అప్పల్నాయుడుని ఎంతగానో అభిమానించే వారన్నారు. వారి మరణానికి స్నేహ కళ సాహితి ప్రగాఢసంతాపం తెలియజేస్తుందని తెలిపారు.

25వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లింపు

పార్వతీపురం: జూన్‌లో జరగనున్న ఓపెన్‌స్కూల టెన్త్, ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు ఈనెల 25లోగా చెల్లించాలని డిఇఒ ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. టెన్త్‌కు సబ్జెక్టుకు వందరూపాయలు చొప్పున, ఇంటర్‌కు థియరీ ఒక సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్‌కు రూ.100చొప్పున చెల్లించాలని తెలిపారు. రూ.25 అపరాధరుసుంతో ఈనెల 29వరకు, రూ.50 అపరాధరుసుంతో 31వరకు గడువు ఉందని తెలిపారు. తత్కాల్ పథకంలో ఇంటర్‌కు రూ.వెయ్యి, టెన్త్‌కు రూ.500 జూన్ 2లోగా చెల్లించువచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

సిబ్బంది అభ్యర్థన మేరకు బదిలీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది బదిలీలను అభ్యర్థన మేరకు మాత్రమే చేపట్టడం జరుగుతోందని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి బి.సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22 నుంచి 31 లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. బోధనా సిబ్బంది ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏప్రిల్ 30 నాటికి ఒకే ప్రదేశంలో 2 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నవారు అభ్యర్థనతో (రిక్వస్టు ట్రాన్సర్) బదిలీకి దరఖాస్తు చేసేందుకు అర్హులని ఆయన తెలిపారు.

షెడ్యూల్ వివరాలిలా ఉన్నాయి...

దరఖాస్తు స్వీకరణ 23.5.2023 నుండి 25.05.2023 సాయంత్రం గం.3.30 లోగా
దరఖాస్తు పరిశీలన 26.5.2023 సాయంత్రం గం.4.00 వరకు
మెరిట్ లిస్టులు ప్రదర్శన 27.05.2023
అభ్యంతరాలు స్వీకరణ 28.05.2023
తుది జాబితా ప్రదర్శన 29.05.2023
కౌన్సిలింగ్ జరుగు తేది 30.05.2023 మరియు 31.05.2023
కౌన్సిలింగ్ జరుగు స్థలం గిరిమిత్ర మీటింగ్ హాల్, పార్వతీపురం.

బదిలీ కోరుకునే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 25న మధ్యాహ్నం 3.30 గంటలు నాటికి జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన ఆదేశించారు. దరఖాస్తులపై తప్పనిసరిగా సంబంధిత ప్రధానోపాధ్యాయుల కౌంటర్ సంతకం చేయించాలని, లేనిచో దరఖాస్తులు తిరస్కరించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

ఏనుగుల సమస్య పరిష్కరించాలి

కలెక్టరేట్ : ఏనుగుల సమస్య వెంటనే పరిష్కరణ చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు కొల్లి సాంబమూర్తి, వి.ఇందిర, టిడిపి కొమరాడ ఉపాధ్యక్షులు పడాల హరిబాబు, ఎపి రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి కె.భాస్కరరావు, జనసేన కొమరాడ మండల కన్వీనర్ టి.జైకర్, సిపిఐ లేబరేషన్ జిల్లా నాయకులు పి సంఘం మాట్లాడుతూ ఒడిశా నుండి వచ్చిన ఏనుగులు వల్ల నేటికీ కురుపాం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పాలకొండ, సీతంపేట, బలిజిపేట మండలాల్లో 11 మంది చనిపోగా, 7 ఏనుగులు కూడా మృతి చెందాయన్నారు. అలాగే పంట, ఆస్తి నష్టం సుమారు రూ.4కోట్లు వరకు నష్టం జరిగిందని, కావున ఇలాంటి సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఏనుగులు అడవికి లేదా జూకు తరలించాలని కోరారు. ఏనుగుల దాడిలో మృతి చెందిన 11 కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.నూకరాజు, బత్తిలి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు రాము, సిపిఐ లిబరేషన్ పాలకొండ మండల కార్యదర్శి బి వెంకటరమణ పాల్గొన్నారు.

సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలి

కలెక్టరేట్ : వీరఘట్టం ఎంఇఒ, రేగులపాడు కెజిబివి ఎస్‌ఒల స్పెన్షన్లు వెంటనే ఎత్తివేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి సోమవారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిని అందజేసింది. రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని గతంలో కలెక్టర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.మురళీమోహనరావు, ఎపి ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సింహాచలం, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ, జిటిఎ జిల్లా అధ్యక్షులు బిఎస్ కె సంజీవి, ఎపిటిఎఫ్ నాయకులు ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై టిడిపి ఫిర్యాదు

సాలూరు : ఇళ్ల స్థలాలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసిపి నాయకులు ఆందోళన చేయడం విడ్డూరమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి అన్నారు. సోమవారం ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్‌తో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్‌లో పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు పై ఫిర్యాదు చేశారు. జోగారావు అధ్యర్యాన వైసిపి నాయకులు కార్యకర్తలు చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేయడం అన్యాయమని అన్నారు. అధికార పార్టీ నాయకులకు ఒక చట్టం, ప్రతిపక్ష పార్టీ నాయకులకు మరో చట్టం వుండదని ఆమె చెప్పారు. కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మక్కువ మండలం అధ్యక్షుడు జి.వేణుగోపాలరావు వున్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులు

రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘం కార్యాచరణ మేరకు సోమవారం పార్వతీపురం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా విఆర్‌ఒల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె శంకరరావు, ఎం సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు. ఇందులో భాగంగానే తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షల ప్రారంభించామని అన్నారు. అనంతరం దీక్షా శిబిరాన్ని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మత్రాపు మహేష్, సెక్రటరీ బాలకృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్ మురళీమోహన్ సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు.

పోటీ పరీక్షల్లో వాలంటీర్ల రిజర్వేషన్‌కు కృషి

డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి -మక్కువ

రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి నిర్వహించే పోటీ పరీక్షల్లో వాలంటీర్లకు రెండు నుంచి ఐదు శాతం మధ్య రిజర్వేషన్ కల్పించేలా కృషి చేస్తామని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని మార్కొండపుట్టిలో సోమవారం వాలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న వాలంటీర్లు చేస్తున్న సేవలకు మరింత గుర్తింపు ఇచ్చేలా ప్రభుత్వం తరపున నిర్వహించే పరీక్షల్లో రిజర్వేషన్ గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. నవరత్నాలు ప్రజలకు అందించడంలో వాలంటీర్ల పాత్ర గుర్తించదగిన విషయమన్నారు. ప్రజల్లో రాజకీయ నాయకుల కంటే వాలంటీర్లే వార్డు స్థాయిలో గుర్తింపు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలు గుర్తించేలా వివరించాలని వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మామిడి శ్రీనివాసరావు, వైసిపి మండల నాయకులు రంగునాయుడు, ఎంపిడిఒ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేసిన డిప్యూటీ సిఎం రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో వాలంటీర్లకు వందనం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారానే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి లబ్ధిదారుని మన్ననలను వాలంటీర్ పొందాలన్నారు. మండలంలో 22 సచివాలయాల ద్వారా 331 మంది వాలంటీర్లు ఉండగా సేవా వజ్రకు ఇద్దరు, సేవా రత్నకు ఐదుగురు, సేవా మిత్రకు 189 మంది ఎంపికయ్యారన్నారు. అనంతరం వాలంటీర్లు సేవలను అభినందిస్తూ సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంత కుమారి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, సర్పంచ్ సువ్వాడ శశికళ, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని 2,3,4,5,6, వార్డు సచివాలయాలకు సంబంధించిన వాలంటీర్లకు వందన కార్యక్రమంలో భాగంగా 77మంది వార్డు వాలంటీర్లను స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందజేసి ఈ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని ప్రజలకు తెలియపర్చాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందనితెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్లు కె.రుక్మిణి, ఇందుపూరు గున్నేస్వరరావు, పార్టీ అధ్యక్షులు కె బాలకష్ణ, కమిషనర్ రామప్పల నాయుడు, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, వార్డు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు..

సీతానగరం : ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించే వారధులే వాలంటీర్లని ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని నేరుగా ప్రజలకు అందజేసి మనల్ని పొందుతున్న వారే వాలంటీర్లు అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందజేయడంలో వాలంటీర్ల కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. మంచి పేరు తెచ్చుకున్న వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బి.చిట్టి రాజు, గ్రామ సర్పంచ్ ఆరుద్రమ్మ, వైసిపి నాయకులు దాదాపు శ్రీను, ధనుంజయ, గౌర్నాయుడు, శ్రీరాములునాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్ల సన్మానసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పనుల ప్రతిపాదనలు సకాలంలో పంపాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సకాలంలో అధికారులు సమర్పించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. సకాలంలో ప్రతిపాదనలు సమర్పించకపోవడం వల్ల జిల్లాకు వచ్చే నిధులు తగ్గిపోతాయని, తద్వారా జిల్లా ప్రగతి కుంటుపడుతుందని ఆయన తెలిపారు. సోమవారం మండల అధికారులతో జిల్లాలో అభివృద్ధి పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల నిమిత్తం సకాలంలో పంపించడంలో నిర్లక్ష్యం వహించడంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్లులు అప్ లోడ్ కాకపోవడం వలన నిధులున్నా ఖర్చుచేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నూరు శాతం పనులను గ్రౌండింగ్ చేయించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇనుము, సిమెంటు సబ్సిడీ ధరలపై లబ్దిదారులకు అందిస్తుందని, ఇది లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని, లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లక్ష్యాలు నిర్దేశించుకొని నిర్మాణాలు దశల వారీగా పురోగతి ఉండేలా పనులు చేయించాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు సంఖ్యకు, హాజరుకు కొన్ని మండలాలలో తేడాలు వస్తున్నాయని, హాజరు అన్ లైన్‌లో సరిగా నమోదు చేయకపోతే లబ్దిదారులు ఆర్థికంగా నష్టపోతారని, అటువంటి తేడాలు రాకుండా చూడాలని తెలిపారు. పనులను అన్ని శివారు గ్రామాలకు సమానంగా కేటాయించాలని సూచించారు.

రీసర్వేకు సంబంధించి రెండో విడత భూసర్వేలో భాగంగా 152 గ్రామాలలో చేపట్టిన సర్వే పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. మ్యుటేషన్లు, ఫైనల్ ఆర్‌ఒఆర్ సిద్ధం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింటు కలెక్టరు సి. విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ఓవరాల్ ఛాంపియన్

విజయనగరంటౌన్ :గత మూడు రోజులుగా విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి 6వ యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 13 విభాగాలకు గాను 8 విభాగాల్లో పతాకాలు సాధించి ఓవర్ ఆల్ రన్నర్ ఛాంపియన్ షిప్‌ను విజయనగరం సొంతం చేసుకుంది. వీరిలో పి.దేవ కుమార్ (80-86కేజీలు), బి.చంద్రశేఖర్ (86-92కేజీలు) బంగారు పతకాలు, ఎస్.తేజేశ్వర్ (46-48కేజీలు), ఎస్. మోహన్ రావు (70-78 కేజీలు) వెండి పతకాలు, సిహెచ్ చంద్రశేఖర్ (51-54), జె.వసంత్ (54-56), కె. రవితేజ (57-60), బి. మనోజ్ (66-70) కాంస్య పతకాలు గెలుపొందారు. బంగారు పతకాలు సాధించిన పి. దేవకుమార్, బి. చంద్ర శేఖర్ త్వరలో సిక్కింలో జరగబోవు యూత్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించబోతున్నారు. విజేతలను బాక్సింగ్ ఆసోయేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి. ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు, డి.మురళి, బి. జగదీష్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాస రావు, బి. ప్రసాద్ అభినందించారు.

గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజల సమస్యలను సాధ్యమైనంతవరకు గ్రామ సచివాలయం, మండల స్థాయిలోనే పరిష్కరించి వారు జిల్లా కార్యాలయాలకు వచ్చే ఇబ్బందులను తొలగించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల గూర్చి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ 94 వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీటిలో కొన్ని....

- సాలూరు పట్టణం 8వ సచివాలయ పరిధిలో సర్వే నెంబరు 216/2 లో ఆక్రమణకు గురైన 0.70 సెంట్లభూమిని స్వాధీనం చేసుకొని, గిరిజనులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ పాలవలస మధుసూదన్ రావు అర్జీ అందజేశారు.
- కురుపాం మండలం బర్లకోటకు చెందిన ఆరిక భారతమ్మ టేకరిఖండి నుంచి తమ గ్రామం వరకు రోడ్డు మంజూరైందని కానీ ఇంతవరకు రోడ్డు పని ప్రారంభించలేదని, త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని దరఖాస్తు అందజేశారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

- సీతానగరం మండలం పెదంకలాం పంచాయతీ కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో గల జక్కువానిబందకు ఉపాధి హామీ పనులు రైతులతో చేయించాలని బలగ రామినాయుడు, గ్రామస్తులు అర్జీ అందజేశారు.
- గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామ రెవెన్యూలో గల కొండపై భాగాన ఏడేళ్లుగా సాగు చేస్తున్నామని, రెవెన్యూ అధికారులు ఎటువంటి సమాచారం తెలియపరచకుండా కొలతలు వేస్తున్నారని, కొలతలు ఆపి తాము సాగు చేసుకుంటున్న భూమికి మాకు డిపట్టా ఇప్పించాలని పప్పల సూర్యనారాయణ, ఇతరులు దరఖాస్తు అందజేశారు.
- పార్వతీపురం మండలం తాళ్ల బురిడి గ్రామానికి చెందిన దాసరి బంగారమ్మ వారి ఇంటికి పొజిషన్ పట్టా ను మంజూరు చేయాలని కోరారు. పెద్ద బొండపల్లికి చెందిన డి.సుందర్రావు తన భూమి ఆన్లైన్లో సర్వే నెంబర్ తప్పుగా నమోదు చేసి ఉన్నారని, తప్పులను సవరించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే పార్వతీపురం పట్టణానికి చెందిన సంచల ఆదిలక్ష్మి పెదమరికిలో సర్వే నంబర్ 1-1 భూమిని 15ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని ఆ యొక్క భూమికి డి పట్టా మంజూరు చేయాలని కోరారు.
- పార్వతీపురం నుంచి కూనేరు వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిపై గోతులను పూడ్చాలని కొల్లి సాంబమూర్తి దరఖాస్తు అందజేశారు.

సీతంపేట: ఐటిడిఎ స్పందనకు 49 వినతులు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమం సోమవారం పిఒ కల్పన కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గెడ్డగూడకు చెందిన కృష్ణారావు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని విన్నవించారు. తోత్తడి గ్రామానికి చెందిన ప్రసాదరావు విద్యుత్ స్తంభాలు మార్చాలని, నడిమి గూడకు చెందిన ఎసోని సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. బిల్లమడకు చెందిన పాలక కన్నయ్య ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన వ్యవసాయ బోరును దొంగలించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇప్పమాను గూడకి చెందిన వినోద్ భూ పట్టా మంజూరు చేయాలని, ఎగువరుగడకు చెందిన నాగేశ్వరరావు సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని, బందపల్లికి చెందిన చామంతి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డిడి నగేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేట్ జి మురళి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, వైద్యాధికారి కృష్ణమోహన్ సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నాం


కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అలరించిన సాహితీ సభ

సాలూరు: పట్టణంలోని పింఛను దారుల సంఘం కార్యాలయంలో సాలూరు సాహితీ మిత్ర బృందం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన సాహితీ కార్యక్రమం ఆహుతులను అలరించింది. ఆర్యన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సినీ సంగీత పాటలలో తెలుగుతనం అనే అంశంపై వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా జర్జాపు ఈశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా పాటల్లో వున్న మాధుర్యం వెలకట్టలేనిదని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి మాట్లాడుతూ కొన్ని సినిమా పాటల్లో వున్న తెలుగు తనం శ్రమని మరిపిస్తుందన్నారు. కార్యక్రమంలో సాలూరు సాహితీ మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెవి తిరుమలరావు, అధ్యక్షులు రావాడ కృష్ణకుమారి, సభ్యులు గొట్టపు శ్రీనివాసరావు, చావలి శేషు మాష్టారు, ఆకుల గణపతి మాష్టారు, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

అంధుడికి నగదు అందిస్తున్న గ్రామస్తులు

అంధుడికి ఆర్థిక సాయం

బలిజిపేట : మండలంలోని పెదపెంకికి చెందిన టేకు శంకరరావు అనే అంధుడికి అదే గ్రామానికి చెందిన రౌతు మురళి రూ.11,500 నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో నేతాజీ గ్రంథాలయం వద్ద సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో అనేకమంది ఇటువంటి అంధులకు, పేదలకు ఆర్థికంగా సహకరిస్తూ వస్తున్నారని తెలిపారు. అయితే యువత ఎక్కువగా ఇటువంటి కార్యక్రమంలో పాలుపంచుకోవడం అభినందనీయమని యువతను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల నివారణకు దశ పత్ర కషాయం

ప్రజాశక్తి- పాచిపెంట

రాబోయే ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, వరి వంటి పంటలపై వచ్చు వివిధ రకాల పురుగులు తెగుళ్ల నివారణ కోసం దశ పత్ర కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణమ్మ, శ్రీనివాస్ అన్నారు. కేసలీ గ్రామంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సమక్షంలో ఐసిఆర్‌పి మీసాల మోహన్‌రావు దశ పత్ర కషాయాన్ని తయారు చేశారు. వేప కానుగ, మారేడు, జిల్లేడు, ఉమ్మెత్త, వావిలాకు, గన్నేరు, జామ, సీతాఫలం, బొప్పాయి, ఆముదం వంటి పది రకాల ఆకులను ఒక్కొక్కటి రెండు కిలోలు చెప్పన సేకరించి మెత్తగా నూరి ముద్దగా చేసుకోవాలన్నారు. దానికి పొగాకు కాడల పొడి ఒక కేజీ, సొంటి పావు కిలో, అల్లం ఒక కేజీ, వెల్లుల్లి ఒక కేజీ, పచ్చిమిర్చి ఒక కేజీ, పసుపు పొడి పావు కిలో సేకరించి ముద్దగా తయారు చేసి పెట్టుకోవాలన్నారు. అనంతరం ఒక

కషాయాన్ని తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రెండు వందల లీటర్ల డ్రమ్ములో 20 లీటర్ల ఆవు మూత్రం రెండు కిలోల ఆవు పేడ కలిపి ముందుగా సొంటి, పసుపు పొడిని శుభ్రంగా కలిపి అనంతరం ముద్దగా నూరిన 10 రకాల ఆకులను మిగిలిన అన్ని పదార్థాలను కలిపి పొద్దున్న సాయంత్రం కనీసం రెండు మూడు నిమిషాల పాటు సవ్య దిశలో కలుపుతూ 40 రోజులపాటు మురగ పెట్టాలన్నారు. 40 రోజులు తర్వాత ఈ కషాయం తయారై పిచికారికి సిద్ధంగా ఉంటుందన్నారు. ఎకరానికి కనీసం ఐదు నుంచి ఆరు లీటర్ల వరకు చేను బాగా తడిచేటట్టుగా పిచికారి చేసుకుంటే అన్ని రకాల పురుగుల పోతాయన్నారు. దీని తయారీకి ఎకరానికి కేవలం 50 రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుందని అదే రసాయనాలపై అయితే 400 రూపాయలు నుంచి 500 రూపాయలు వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అతి తక్కువ ఖర్చుతో అన్ని రకాల పురుగులను అన్ని పంటలపై నివారించుకోవడమే కాకుండా ఎలాంటి రసాయన అవశేషాలు లేని ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. అనంతరం గులిరాగి క్షేత్రాన్ని సందర్శించి దిగుబడిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు చిన్నారి, గుణవతి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

పిట్స్‌పై అవగాహన

సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రీఎక్లంప్సియా డేను సోమవారం సోమవారం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు హైబిపి ఉన్నప్పుడు ఫిట్స్ రాకుండా ఉండడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యుల రాజేష్, ఆర్ఎంఒ గౌరీ శంకర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పార్వతీపురం టౌన్ : నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు స్థాని పట్టణ పోలీసు స్టేషన్‌లో 13 ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నామని, కావున ఉత్సాహవంతులు ఉదయం 11 గంటలకు పోలీసు స్టేషనుకు వచ్చి వేలంలో పాల్గొనవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పట్టణ సిఐ కృష్ణారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 15వ రోజు మన దేశ సంస్కృతిని పెంపొందించి పరిరక్షించేవి కళలని విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకను బయటకు తీయడానికి ఆట, పాట, మాటలు ద్వారా సాంస్కృతిక, జానపద నృత్య కార్యక్రమాలను యోగ గురువు కె.జనార్ధన్ రావు నేర్పించారు. గ్రంథాలయాధికారి గణేష్ బాబు, ఈశ్వర్ పాల్గొన్నారు.

మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

కనీస వేతనాలు వచ్చేలా పనిచేయించాలి

కొమరాడ : ఉపాధి పను చేస్తున్న వేతనదారులకు కనీస వేతనాలు వచ్చేలా పనులు చేయించాలని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. మండలంలోని శివినిలో కొద్రుబంద చేపడుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఉపాధి వేతదారులు పనికొచ్చిందీ, లేనిదీ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ వ్యాప్తంగా వడదెబ్బ బారిన పడకుండా ఉదయం వేగంగా వచ్చి పని చేసుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పని చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు చేయించాలన్నారు. వేతనదారులకు కనీస వేతనాలు వచ్చేలా పనులు చేస్తే కూలీలకు ఆర్థికంగా ఉపయోగం ఉంటుందన్నారు. ఆయన వెంట ఎపిఒ బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ సోమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

గర్భిణుల వసతి గృహ పరిశీలన

సాలూరు: పట్టణ పరిధిలోని గుమడాం వైటిసిలో వున్న గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ కేసలి అప్పారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిసిపిఒ సత్యనారాయణతో కలిసి ఆయన హాస్టల్‌ని పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న సౌకర్యాలు, పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పంపిణీ చేస్తున్న ఆహారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు హాస్టల్‌లో ఎదురవుతున్న సమస్యలు వివరించారు. అనంతరం గర్భిణులకు మిఠాయిలు పంచిపెట్టారు. తర్వాత ఆయన కొలకోటి వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట సాలూరు, పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు వున్నారు.

గర్భిణులకు మిఠాయిలు పంచుతున్న కేసలి అప్పారావు

డిఆర్ డిపోల తనిఖీ

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన సహకార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న డిఆర్ డిపోలను జిసిసి డిఎం సంధ్యారాణి పరిశీలించారు. సోమవారం మండలంలోని కె. గుమడ, గనసర, భామిని గ్రామాల్లో ఆమె పర్యటించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులతో సమావేశమై గతంలో మాదిరిగా డిఆర్ డిపోల్లో అన్ని నిత్యావసర వస్తువులూ అందుబాటులో ఉంటాయని అందరు వినియోగించుకోవాలని తెలిపారు. బయట వర్తకుల వద్ద నకిలీ లేక కల్తీ సరుకులను కొని మోసపోవద్దని సూచించారు. డిఆర్ డిపో నిత్యం తెరచి ఉంచాలని సేల్స్ మెన్‌కి ఆదేశించారు. పిర్యాదు కోసం జిసిసి మేనేజర్ నెంబర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి సిసి మేనేజర్ దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిపోను పరిశీలిస్తున్న డిఎం సంధ్యారాణి

సమావేశంలో మాట్లాడుతున్న ఇంఛార్జి జగదీశ్వరి

మినీ మహానాడుకు సన్నద్ధం

కురుపాం : అరుకు పార్లమెంట్ పరిధిలో గల సాలూరులో ఈనెల 25న జరగబోయే మినీ మహానాడుకు తెలుగుదేశం కుటుంబ సభ్యులంతా వెళ్లడానికి సిద్ధం కావాలని నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు ఆధ్వర్యంలో ఐదు మండలాల టిడిపి నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి టిడిపి కార్యకర్తలంతా మినీ మహానాడుకు బయలుదేరడానికి ఆ మండలాల నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బయలుదేరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు నాయకులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను రక్షించాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మీడియా స్వేచ్ఛను రక్షించాలని, జర్నలిస్టుల దాడులను అరికట్టాలని పాలకొండ ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ బుచ్చియ్యకు సోమవారం వినతి పత్రం అందించారు. హైదరాబాద్‌లో ఎబిఎన్ రిపోర్టర్‌పై దాడిని ఖండిస్తూ పాలకొండలో జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై జరిగిన దాడిఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. విధినిర్వహణలో ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై, సిబ్బందిపై దాడిచేయడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా, ప్రజల తెలుసుకునే హక్కుపై దాడి అన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులపై దాడికి బాధ్యులైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరం జర్నలిస్టులపై సిఐడి పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ ప్రెస్‌క్లబ్ సభ్యులు సత్యనారాయణ, చంద్రరరావు, ఈశ్వరరావు, మండల నాయుడు, మన్మథ, ఎస్‌కె శివప్రసాద్, శంకరరావు, రాధాకృష్ణ, చంటి, నిరంజన్, కాంతారావు, బిసి నాయుడు, రాయి రామకృష్ణ, వెలమల రమణ, రవి, బాలరాజు, బండారి శివ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విలేకర్లు

సాలూరు: కడప ఎంపి అవినాష్ రెడ్డి అనుచరులు జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన జర్నలిస్టులు సోమవారం మండల తహశీల్దార్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై వైసిపి ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులు దాడి చేయడం మీడియా స్వేచ్ఛ ని హరించడమేనని ప్రెస్ క్లబ్ నాయకులు బి.విశ్వేశ్వరరావు, జి.నాగేశ్వరరావు చెప్పారు. బాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు రాము, గుప్తా, సీతారాం, కె.మోహన్ రావు, కె.సింహాద్రి, ఎల్.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

బంజరు భూములకు పట్టాలివ్వాలి

కలెక్టరేట్ : 60 ఏళ్లుగా బల్లేరు గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ, బంజర భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం బల్లేరులో గల 25 గిరిజన కుటుంబాలు గత 6ఏళ్ల నుంచి నుండి కురుపాం మండలం గొట్టివాడ పంచాయతీ బోరు రెవెన్యూలో గల సుమారు వంద ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గిరిజనులు పట్టాలు కావాలని దరఖాస్తు చేసుకుంటే కురుపాం రెవెన్యూ అధికారులు ఆ భూమి వేరే రెవెన్యూలో ఉందని ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. అనుభవించడమే తప్ప పట్టా ఇవ్వలేమని అంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని గిరిజనులు ఎక్కడ సాగుచేసిన పట్టాలు ఇవ్వాల్సినా బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వెంటనే పట్టాలు ఇవ్వాలని, లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జియ్యమ్మవలస మండల కార్యదర్శి కోరంగి సీతారాం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆరిక అశోక్ కుమార్ గిరిజనులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న గేదెల రవి, తదితరులు

క్రికెట్ టోర్నీ విజేత సొర్లంగి

సీతంపేట: మండలంలోని సామరెల్లి -సీధి గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ ప్రకాష్ స్టేడియంలో గత 43 రోజులగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లా సొర్లంగి జట్టు విజేతగా నిలిచింది. ట్రోపి విజేతకు ప్రైజ్ మని రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన పార్వతీపురం మండలం కొండవాడ జట్టుకు రూ.15వేలు నగదు బహుమతులను మన్య ప్రగతి ఛైర్మన్ గేదెల రవి చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిడ్డిక దమయంతి నాయుడు, మాజీ ఎంపిటిసి స్వర్ణలత, మాజీ ఉప సర్పంచ్, మన్య ప్రగతి అధ్యక్షులు గేదెల జనార్ధనరావు, జనరల్ సెక్రటరీ మీనక ఉమా మహేశ్వరరావు, బిడ్డిక జయప్రకాష్, మీనక కొండలరావు, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కన్నెంగెడ్డ ప్రక్షాళన

శృంగవరపుకోట : వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో శృంగవరపుకోట మేజర్ పంచాయతీలో ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు కన్నెంగెడ్డను యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేపట్టినట్లు సర్పంచ్ సంతోషి కుమారి తెలిపారు. గెడ్డనీరు రోడ్లపైకి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు వివరించారు. జెసిబి సహాయంతో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున కన్నెంగెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 22ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం సాయంత్రం కలుసుకున్నారు. వేర్వేరు వృత్తుల్లో స్థిరపడిన వారు కొందరు, ఉద్యోగాలు చేసి రిటైరైన వారు మరికొందరు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 1998-2001 బ్యాచ్‌కు చెందిన బికాం డిగ్రీ విద్యార్థుల అపూర్వ కలయిక డిగ్రీ కళాశాల ఆవరణలో సందడిగా జరిగింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర వృత్తుల్లో స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకున్నారు. గతంలో చదినప్పటి గురువులను పిలిపించి సన్మానం చేశారు. కామర్స్ లెక్చరర్, రిటైర్డ్ ప్రిన్సిపల్ కోరాడ వెంకటరావును సన్మానించారు. ప్రస్తుత డిగ్రీ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ చిరంజీవులు, మిగిలిన అధ్యాపకులను సన్మానించారు. అప్పట్లో కామర్స్ ట్యూషన్లు చెప్పిన మహంతి రాంబాబు మాష్టారు, గున్నరాజు మాష్టారు, సూర్యనారాయణ, బద్రీ, నానీ, జనార్ధన్ మాష్టార్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి యాంకర్‌గా కళాశాల పూర్వ విద్యార్థి జి.ఉమా మహేశ్వరరావు వ్యవహరించారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వీరఘట్టం

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి విక్రాంత్ లు అన్నారు. సోమవారం మండలంలోని పనస నందివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాడ్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాంన్నారు. ఇప్పటికే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎవరైన అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింకటి వెళ్లి సంక్షేమ పథకాలు అందే తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి సరోజినీ, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, నాయకులు ఉమామహేశ్వరరావు, పివిఆర్ పురం, నీలా నగరం సర్పంచులు పి వెంకటరమణ, వావిలపల్లి పురుషోత్తమనాయుడు, గంగ నాయుడు, సన్యాసినాయుడు, ఎంపిటిసి బి సూర్యప్రకాష్, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని బూర్జి గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. గడపకులో వచ్చే సమస్యలను అక్కడికక్కడే వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఇన్ని పథకాలను ప్రవేశపెట్టిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసు చిన్నంనాయుడు, ఎంపిపి బి. రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం. బాబ్జి, జిల్లా వ్యవసాయ మండల ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, వైసిపి నాయకులు బి చిట్టిరాజు, ఎం రామకృష్ణ, జి. అన్నంనాయుడు, అప్పల నాయుడు, కే శ్రీనివాసరావు, బి శ్రీనివాసరావు, ఆర్‌వి పార్థసారథి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

బొబ్బిలి : గ్రోత్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించాడు. ముగ్గురు గాయపడ్డారు. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌తో పిక్కరాయి లోడ్ తరలిస్తుండగా గ్రోత్ సెంటర్ వద్ద ట్రక్కుకు పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ ట్రక్కును రోడ్డు పక్కన నిలుపుదల చేసి వెళ్లిపోయాడు. రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్ ట్రక్కును బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన టాటా ఏస్ వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ఉన్న బోనెల సాంబయ్యకు గాయాలయ్యాయి. రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కును, వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పోలీసులు తీసేందుకు ప్రయత్నించారు. ఈలోగా ముగ్గురు యువకులు గ్రోత్‌సెంటర్ నుంచి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కు, వ్యాన్‌ను బలంగా ఢీకొన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువకుడు కోట్ల సురేష్, వెనుక కూర్చున్న బూర్లి చిన్నారావు తీవ్రంగా, మరో యువకుడు సురేష్ స్వల్పంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన కోట్ల గణేష్(23) చికిత్స పొందుతూ మరణించాడు. చిన్నారావుకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో వెళ్లడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్ బిటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

తాతా మనవళ్లకు గాయాలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెంకంపేట పంచాయతి వసుంధర నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బగ్గం వెంకటరమణ తన మనుమడు రిత్విక్‌తో కలిసి పార్వతిపురం పట్టణంలోని తన సొంత పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా పార్వతీపురం విశాఖపట్నం ప్రధాన రహదారి పై గెడ్డవీధి సమీపంలో వెనుక నుండి లారీ ఢీ కొట్టింది. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం లీగల్ : గంట్యాడ పోలీసు స్టేషనులో 2019 అక్టోబర్ 10న నమోదైన పోక్సో, అట్రాసిట కేసులో నిందితుడైన గంట్యాడ మండలం కొండతామరాపల్లికి చెందిన సారిపల్లి చిన్నారావు (65)కు 20ఏళ్లజైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. నిందితుడు సారిపల్లి చిన్నారావు బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో ఆయనపై పోక్సో చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసును ఎస్ఐ కె.కృష్ణవర్మ నమోదు చేశారు. విజయనగరం ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీ బి. మోహనరావు దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం ఇన్చార్జ్ పోక్సో కోర్టు ఫోర్త్ అడిషనల్ జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా నిందితుడు సారిపల్లి చిన్నారావుకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన విజయనగరం రూరల్ సిఐ టివి తిరుపతిరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.